క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం


విరాళం అందజేస్తున్న దృశ్యం

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ గుహేశ్వరి పసుపతినాథ ఆలయ నిర్మాణ పనులకు ఆదివారం విశ్రాంత ఉపాధ్యాయుడు వారధిరెడ్డి రూ. 50 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సతీమణి రాములమ్మ జ్ఞాపకార్థం ఆలయ అభివృద్ధికి తమ కుటుంబ సభ్యులతో కలిసి రూ. 50 వేలు నగదును ఆలయ నిర్వాహకులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివి ప్రతాప్ రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు వై.సుబ్బారెడ్డి, కగేంధర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు లెనిన్


నివాళులర్పిస్తున్న ఏఐటీయూసీ నేతలు

రాయచోటి అర్బన్ : సమసమాజం స్థాపన కోసం పోరాడిన యోధుడు విఐ లెనిన్ అని ఏఐటీయూసీ నేతలు అన్నారు. లెనిన్ శత జయంతిని పురస్కరించుకుని ఆదివారం కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ నేతలు లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ నూతన ప్రపంచ మార్గదర్శి, ప్రపంచ విప్లవ నేత లెనిన్ అంటూ కొనియాడారు. పీడిత, తాడిత ప్రజల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి లెనిన్ అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు శ్రీనివాసులు, పుల్లయ్య, నాగేశ్వరి, తులసితోపాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

సంబేపల్లె ఎస్ఐగా రామకృష్ణ



సంబేపల్లె : మండల ఎస్ఐగా ఆదివారం పి.రామకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఎండీ షరీఫ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బదిలీపై రాయచోటి టౌన్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో నిమ్మనపల్లి ఎస్ఐగా పనిచేస్తున్న రామకృష్ణ ఇక్కడికి రావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు ప్రతి నిత్యం అందుబాటులో ఉంటూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపడతామన్నారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ట


నూతనంగా ప్రతిష్ఠించిన స్వామివార్ల విగ్రహాలు

వీరబల్లె (రాయచోటి టౌన్) : వీరబల్లె మండల పరిధిలోని ఒదివీడు కస్బాలో శ్రీ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వాముల విగ్రహ ప్రతిష్ఠను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో వినాయకుడి పూజలు, హోమాలు జరిపారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠను చేపట్టారు. అంతకు ముందు కలశస్థాపన చేసిన తరువాత స్వాముల వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా కనుల పండువగా జరిగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టడంతోపాటు భక్తులందరికి అన్నప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

వడ్డె రమణకు అవార్డు


అవార్డును అందజేస్తున్న ఏపీ వడ్డెర ఉద్యోగుల సంఘం నేతలు

రాజంపేట : వైఎస్సార్‌సీపీ బీసీ నేత, వడ్డెర రాష్ట్ర సంఘం గౌరవ అధ్యక్షుడు వడ్డె రమణకు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును దక్కించుకున్నారు. ఈ మేరకు ఈ విషయాన్ని ఆదివారం ఆయన విలేకర్లకు తెలిపారు. గుంటూరులోని విశ్వబ్రహ్మణ కల్యాణ మండపంలో రాష్ట్ర వడ్డెర ఉద్యోగుల సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారన్నారు. కాగా సమాజానికి, వడ్డెర సమాజానికి చేసినందుకు రమణను లైఫ్‌టైం ఆచీవ్‌మెంట్ అవార్డును అందచేస్తూ ఘనంగా సత్కరించారు. వడ్డెరల సమస్యలు పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తానని రమణ పేర్కొన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటిపల్లె కొత్తపేట సమీపంలోని గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు.

భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర


ఊరేగుతున్న సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులు


శోభాయాత్రలో పాల్గొన్న ఆకేపాటి, పోలా


శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట టౌన్ : అయోధ్యలోని రామ మందిరంలో సోమవారం భగవాన్ బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ చేపడుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం రాజంపేట పట్టణంలో శ్రీరామభక్త సేవా సమితి ప్రతినిధులు సీతారాముల శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. తొలుత సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులను ప్రత్యేక పుష్పాలతో, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక రథంలో కొలువుదీర్చారు. అనంతరం శోభాయాత్ర తిరుపతి రోడ్డులోని వాసవీమాత జమ్మిచెట్టు నుంచి ప్రారంభమై పాతబస్టాండ్, ఆర్అండ్‌బీ బంగ్లా, ప్రభుత్వ ఆసుపత్రి, నూనెవారిపల్లె, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, ఆర్ఎస్‌రోడ్డు మీదుగా సాగింది. దారిపొడవునా రామ భక్తులు కాషాయ జెండాలను చేతబూని జై శ్రీరామ్ అంటూ ముందుకు సాగారు. పలు కూడలి ప్రాంతాల్లో రామనామాన్ని జపిస్తూ నృత్యాలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సాగిన శోభాయాత్రలో పెద్దఎత్తున రాములోరి భక్తులు పాల్గొనడంతో పట్టణంలో సందడి వాతావరణం కనిపించింది. శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు దాతల సహకారంతో దారి పొడవునా నీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో రామభక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సౌకర్యాన్ని కల్పించారు.

సంఘీభావం తెలిపిన మేడా, ఆకేపాటి, పోలా

పట్టణంలో జరిగిన సీతారాముల శోభాయాత్రకు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డిలు సంఘీభావం తెలిపి శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాముడు ఆదర్శ పురుషుడని కొనియాడారు.

నేడు రామాలయాల్లో ప్రత్యేక వేడుకలు


మాట్లాడుతున్న భజరంగదళ్ సేవ యోజక్ ప్రముఖులు

రామాపురం : అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠ నేడు(సోమవారం) జరుగుతుండడంతో మండల కేంద్రంలోని హరిహరాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక పూజలతోపాటు ఉదయం 9.30గంటల నుంచి భజన కార్యక్రమాలు, 10.30కు ర్యాలీగా ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా అయోధ్యలో జరిగే ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షించడం అనంతరం తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ, భజనలు సాయంత్రం 4 గంటల వరకు జరుగుతందని జిల్లా భజరంగదళ్ సాహసం యోజక్ వీరారెడ్డి, లక్కిరెడ్డిపల్లె ప్రఖండ గౌరవాధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షులు దామోదర్‌నాయుడు, మండల అధ్యక్షులు ఆంజనేయులు, మండల సహకార కార్యదర్శి బలరామలు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠకు మద్దతుగా అన్ని రామాలయాల్లో వేడుకలు జరపాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో హిందూ సమాజం పాల్గొనాలని కోరారు. హాజరయ్యేవారు మద్యం, మాంసాలకు దూరంగా ఉంటూ శ్రీ రాముడి కృపకు పాత్రులు కావాలని తెలియజేశారు.

మంగళపల్లె రామాలయంలో..

అయోధ్యలో 500 ఏళ్ల తరువాత సోమవారం (నేడు) శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ చేయడం చాలా సంతోషదాయమని భక్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం మండలంలోని సుద్దమళ్ల గ్రామం మంగళపల్లె శ్రీ రామాలయంలో ఆలయ ధర్మకర్తలు, యువకులు రామాలయాన్ని శుభ్రపరిచి సోమవారం పూజలకు ఏర్పాట్లను సిద్ధం చేశారు. శ్రీరాముని ఆశీస్సులతో దేశం సుభిక్షంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

నేడు పుల్లంపేటలో..

పుల్లంపేట : నేడు సోమవారం అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని మండల వ్యాప్తంగా ఉన్న రామాలయాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శనివారం పలువురు రామ భక్తులు గ్రామాల్లో పర్యటించి రాముని గొప్పతనం గురించి ప్రజలకు వివరిస్తూ అక్షింతలు ఇంటింటికి అందజేశారు. తదుపరి జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు.


పుల్లంపేటలోని సీతారామాలయం

భక్తులతో అమ్మవారి ఆలయాలు కిటకిట


లక్కిరెడ్డిపల్లె : ప్రత్యేక అలంకారంలో గంగమ్మ


సంబేపల్లె: ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీ అనంతపురం గంగమ్మ దేవత ఆదివారం భక్తులచే విశేష పూజలు అందుకున్నారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచే కాకుండా ఇతర మండలాలు, జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో పోటెత్తింది. ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఆలయ ప్రత్యేక అధికారి రవీందర్ రాజులు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ పూజారులైన ఆదిమూలం వంశీయులు అనంతపురం గంగమ్మ దేవత దర్శనం కల్పిస్తూ అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : సంబేపల్లెలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కోరిన కోర్కెలు తీర్చే దేవత శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ అని భక్తుల నమ్మకం. దీంతో పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులు స్వీకరించారు.

పేదల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్

రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట : పేదల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి కొనియాడారు. ఆదివారం మేడాభవన్‌లో వైఎస్సార్ బీమా కింద నామిని పెంచలమ్మ అనే మహిళకు రూ.1లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు మేలు జరిగేలా నవరత్నాలను తీసుకొచ్చారన్నారు. అలాగే గ్రామాల్లోకి పాలన తీసుకెళ్లిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అటువంటి ముఖ్యమంత్రికి పేదలతోపాటు అన్ని వర్గాలు అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పేదల సంతోషంగా ఉండాలంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కావాలనే కోరుతున్నారన్నారు. రెండవసారి అధికారంలోకి రాగానే పేదల సంక్షేమం మరింతగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సత్యాల మౌనిక, జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సత్యాల రామకృష్ణ, సచివాలయం అడ్మిన్ అంజి, నాయకులు మురళీ ఆచారి, రాజేష్ ఆచారి, సత్యాల హరి తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరం

నందలూరు(రాజంపేట) : యువతకు క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జున రెడ్డి అన్నారు. ఆదివారం సంక్రాంతి సంబరాలలో భాగంగా మండలంలోని టంగుటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన శ్రీ వినాయక క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో టంగుటూరు – ఏ టీమ్, పొందలూరు మధ్య జరిగిన మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, ఎంపీపీ మేడా విజయ భాస్కర్ రెడ్డిలు టాస్‌వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత ఉత్సాహంతో క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ కనబరచాలని, క్రీడలతోనే మానసిక ఉల్లాసం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా శ్రీ వినాయక క్రికెట్ టోర్నీ నిర్వాహకులకు వైఎస్సార్‌సీపీ రాజంపేట నియోజకవర్గ నాయకులు ఆకేపాటి అనీల్ కుమార్ రెడ్డి రూ. 10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం విజేతగా నిలిచిన పొందలూరు టీమ్‌కు మొదటి బహుమతిని గుజ్జుల నారాయణ రూ. 20 వేలు, రన్నరప్‌గా నిలిచిన టంగుటూరు టీమ్‌కు రెండవ బహుమతిని నందలూరు భాస్కర్ రెడ్డి రూ. 10 వేలు అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ అన్నం నాగేంద్ర మూర్తి, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ భవనబోయిన లక్ష్మీనరసయ్య, సర్పంచ్‌లు గీతల నరసింహారెడ్డి, షేక్ మైనుద్దీన్, నియోజకవర్గ అధ్యక్షులు భాస్కర్ యాదవ్, మంచా ఫణీంద్ర, గడికోట వెంకటసుబ్బారెడ్డి, సౌమ్యనాథ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, టంగుటూరు నాయకులు మంచా మురహరి రావు, రాజంపేట జెడ్పీటీసీ దాసరి పెంచలయ్య, గీతల ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

ఉర్దూ భాషపై పట్టు సాధించాలి

ప్రధాన ఆచార్యులు ముఫ్తీ మాసూమ్ సాహెబ్


మాట్లాడుతున్న ఆచార్యులు ముఫ్తీ మాసూమ్ సాహెబ్

రాయచోటి టౌన్ : ఉర్దూ భాషపై ప్రతి ఒక్కరూ పట్టు సాధించాలని మదరసా ప్రధాన ఆచార్యులు ముఫ్తీ మాసూమ్ సాహెబ్ అభిప్రాయపడ్డారు. రాయచోటి పట్టణంలోని పెద్ద మదరసాలో ఆదివారం జరిగిన ఉర్దూ సదస్సులో పాశ్చాత్య భాషపై ప్రేమలో పడి మాతృభాష అయిన ఉర్దూ భాషపై సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మన భారతీయ సంస్కృతి ఆచార వ్యవహారాలు మరచి పాశ్చాత్య పోకడలను అలవరుచుకుంటున్నారన్నారు. పిల్లవాడు మాతృభాష నేర్చుకుంటే తన మనస్సులోని ఫీలింగ్స్‌ను వ్యక్తపరచగలడని, అందుకే నేడు ఒకరికొకరు అర్థం చేసుకోలేక కుటుంబ వ్యవస్థలు క్షీణించి పోతున్నాయని తెలిపారు. ఉపాధ్యాయులు పిల్లల్లో మాతృభాష పట్ల ప్రేమను పెంపొందించాలని, తద్వారా పాఠశాలలు బలపడతాయని, తద్వారా కుటుంబ వ్యవస్థలో ప్రేమ వాత్సల్యం పెంపొంది మాతృభాష తీయదనాన్ని ఆస్వాదిస్తారన్నారు. అలాగే ఉర్దూ ప్రత్యేక డీఎస్సీలు నిర్వహించాలని, ఉర్దూ లైబ్రరీలు నిర్వహించాలని, రాష్ట్ర ఉర్దూ అకాడమీ నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా ఉర్దూ పాఠశాలల పటిష్టత, బలోపేతానికి ప్రతి ఉర్దూ ఉపాధ్యాయుడు సమయం, సమయస్ఫూర్తి, సేవాభావంతో ఒక సైనికుడిలా పనిచేయాలని పలువురు వక్తలు కోరారు. కార్యక్రమంలో అంజుమన్ తరక్కి ఉర్దూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ హాషిమ్, రూటా ప్రధాన కార్యదర్శి సభాతుర్ రెహమాన్, ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీ జక్రియా బాషా, డైట్ ఆచార్యులు అసదుల్లా, విశ్రాంత డైట్ ఉర్దూ ఆచార్యులు షఫీవుల్లాఖాన్, జూనియర్ కళాశాల ఆచార్యులు రహీమ్ బేగ్, అలీ నవాజ్ ఖాన్, నిస్సార్ అహ్మద్, మదర్సా సెక్రటరీ షాకిరుల్లా, హిదయతుల్లా, ఉర్దూ కవులు డాక్టర్ ఇమామ్ ఖాసీం, డాక్టర్ నఖీవుల్లా, ఉర్దూ గాయకులు రహమతుల్లా తదితర ఉర్దూ సంఘం బాధ్యులు, ఉర్దూ ప్రేమికులు, జిల్లాలోని 200 మందికిపైగా ప్రభుత్వ, ప్రైవేటు ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మ తల్లి ఆలయం ఆదివారం అశేష భక్త జనసందోహంతో పోటెత్తింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి సంతాన ప్రాప్తి కోసం వచ్చిన మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె,సారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

గుర్రంకొండ: నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ దద్దాలవారిపల్లెలో గరుడప్ప నాటుసారా విక్రయిస్తున్నాడనే సమాచారం అందుకొన్న పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

లోకాయుక్తాకు ఘనంగా వీడ్కోలు

పెద్దతిప్పసముద్రం: రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పీ.లక్ష్మణరెడ్డి సంక్రాంతి పండుగ విడిది కోసం కుటుంబ సభ్యులతో మండలంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లిలోని స్వగృహానికి విచ్చేశారు. ఆదివారం తిరుగు ప్రయాణంలో ఆయనకు రెవెన్యూ అధికారులు, గ్రామ పంచాయతీ, పోలీసు సిబ్బందితో పాటు ఏఎంసీ మాజీ చైర్మన్ పీ.శ్రీనాథ్‌రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు.

జూదరుల అరెస్ట్

రామసముద్రం: చెంబకూరు గ్రామ సమీపంలోని మామిడి తోపులో కోడిపందెం నిర్వహిస్తున్న వారిపై ఆదివారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. దాడుల్లో ఐదుగురిని అరెస్ట్ చేసి, రెండు కోళ్లను అదుపులోనికి తీసుకుని, రూ. 5270 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఓంశక్తి మాలధారణ భక్తుల ర్యాలీ

వాల్మీకిపురం : అయోధ్య శ్రీరాముడి ఆలయ ప్రారంభోత్సవాన్ని కులమతాలకు అతీతంగా అందరం పండుగలా జరుపుకుందామని స్థానిక శ్రీ నల్లవీర గంగాభవాని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మెన్ మొర్రంరెడ్డి రాంకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక శ్రీ నల్లవీర గంగాభవాని అమ్మవారి ఆలయం వద్ద ఓంశక్తి మాలధారణ ధరించిన భక్తులు జైశ్రీరాం జెండాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆనంద శెట్టి, రమేష్, ఆనంద, భక్తులు పాల్గొన్నారు.

తక్కువ ధరకు ప్రభుత్వ ఇంటర్నెట్


మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

రాజంపేట : ప్రభుత్వం ప్రజలకు తక్కువ ధరకే ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తుందని ఏపీ ఫైబర్‌నెట్ లిమిటెడ్ ఆపరేటర్ల సంస్థ మార్కెటింగ్ మేనేజర్ రేవంత్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆపరేటర్లతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫైబర్ నెట్ ద్వారా వినియోగదారులకు ప్రభుత్వం 190కే ఇంటర్నెట్ ప్యాకేజీని అందిస్తున్నట్లు తెలిపారు. ఇంత తక్కువ ధరకు ఏ సంస్థ కూడా ఇంటర్నెట్ ప్యాకేజీ అందించడం లేదని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ఏపీ ఫైబర్‌నెట్‌కు సంబంధించి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఓఎల్టీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందువల్ల ప్రభుత్వం కల్పిస్తున్న ఈ బృహత్తర సౌకర్యాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సైతం సద్వినియోగం చేసుకునేలా ఆపరేటర్లు కృషి చేయాలని తెలిపారు.

విద్యుత్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి


డైరీలు ఆవిష్కరిస్తున్న ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

కడప కార్పొరేషన్ : విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆ యూనియన్ ఆధ్వర్యంలో 2024 సంవత్సర క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు, ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలపై చర్చించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి రామలింగారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, రెగ్యులర్ ఉద్యోగులకు పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. కారుణ్య నియామకాలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు బాలకాశి, 1104 యూనియన్ నాయకులు ఎస్.క్రిష్ణయ్య, ఎంవీ రమణ, ఐఎన్‌టీయూసీ నాయకులు రాఘవరెడ్డి, ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు మల్లికార్జున రెడ్డి, మంజునాథ్, కె.బ్రహ్మానందరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలను చెల్లించాలి


మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నేతలు

రాయచోటి అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన ఆర్థిక బకాయిల చెల్లింపులో పాలకులు అలసత్వం వహించడం తగదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌లు అన్నారు. ఆదివారం తమ సమస్యల పరిష్కారంలో జరుగుతున్న అలసత్వంపై పట్టణంలోని నేతాజీ సర్కిల్ వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయులు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన పీఆర్‌సీ బకాయిలు, డీఏ అరియర్‌లు, సరెండర్ లీవ్ బకాయిలు, ఏపీజీఎల్ఐ లోన్‌లు, ఫైనల్ పేమెంట్లు, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపులు సంబంధించిన ఉత్తర్వుల విడుదల చేసినప్పటికీ వాటిని నేటికీ చెల్లించకపోవడం బాధాకరం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు చంద్రశేఖర్, అక్రమ్‌బాషా, భాస్కర్‌రెడ్డి, పురం వెంకటరమణ, దావూద్, హేమలత, ఆదినారాయణ, సురేంద్రారెడ్డి, మస్తానయ్య, రమణయ్య, రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 3న బహుజన రాజ్యాధికార సదస్సు

మదనపల్లె : బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3న బహుజన రాజ్యాధికార సదస్సు నిర్వహిస్తున్నట్లు బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెలగౌతమ్‌కుమార్ వెల్లడించారు. ఆదివారం మదనపల్లె నియోజకవర్గానికి సంబంధించి బీఎస్పీ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బందెలగౌతమ్‌కుమార్ మాట్లాడుతూ...పట్టణంలోని సీఎస్ఐ జేసీఎం కమ్యూనిటీ హాల్ నందు ఫిబ్రవరి మూడోతేదీన ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి బీఎస్పీ రాజ్యసభ సభ్యులు రాంజీగౌతమ్, రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి, రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బహుజన రాజ్యాధికార సదస్సు నిర్వహిస్తున్న నేపథ్యంలో... మదనపల్లె నాయకులు సమావేశాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేయాలన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలి


హజ్ కమిటీ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న రూట నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న డీఎస్సీలో ఉర్దూ మీడియం ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని రూట నాయకులు కోరారు. ఈ విషయమై ఆదివారం రూట రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ హిదయతుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి అసదుల్లాబాషా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌసల్ ఆజాంను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్దూ మీడియానికి తగినంత మంది ఉపాధ్యాయులు లేక విద్యార్థులు నష్టపోతున్నారన్నారు.

వేల సంఖ్యలో అభ్యర్థులు ఉర్దూ మీడియం డీఈడీ, బీఈడీలు పూర్తి చేసి డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి ఖాళీలు భర్తీ చేయాలన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హజ్ కమిటీ చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రూట డైరీ కమిటీ చైర్మన్ హాజీ అబ్దుల్ హకీమ్, రాష్ట్ర నాయకులు సత్తార్ ఫైజీ, సిరాజుద్దీన్, మహమ్మద్ అయిబ్, జుబేర్ అహ్మద్, యునుస్ తయిబ్ తదితరులు పాల్గొన్నారు.